క్లుప్తంగా

'హైదరాబాద్-కటక్' రైలుకు దువ్వాడలో హాల్ట్‌పై హర్షం

అగనంపూడి: వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని తూర్పు కోస్తా రైల్వే హైదరాబాద్ నుంచి దువ్వాడ మీదుగా కటక్ వరకు వారాంతపు రైలును జూన్ నెలలో నడుపుతుండడంపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. వచ్చేనెల 6, 13, 20, 27 తేదీల్లో, తిరుగు ప్రయాణంలో వచ్చే నెల 7, 14, 21, 28 తేదీల్లో కటక్ నుంచి దువ్వాడ మీదుగా హైదరాబాద్ వరకు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. అలాగే ఎల్‌టీటీఈ, స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దువ్వాడలో హాల్ట్ ఇచ్చేందుకు గల అవకాశాలను రైల్వే అధికారులు పరిశీలించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



భెల్ గేటు వద్ద సిటూ ఆవిర్భావ సభలో పాల్గొన్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశాఖ డెయిరీ ఎదురుగా గల సంస్థ ప్రవేశ గేటు వద్ద సీఐటీయూ జెండాను సీనియర్ నాయకుడు కె.పవన్ కుమార్ ఎగరవేశారు. సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ సీఐటీయూ 54 సంవత్సరాలుగా కార్మికుల కోసం ఎన్నో కార్యక్రమాలు, ఉద్యమాలు చేసి, కార్మికుల మన్ననలు పొందిందన్నారు. కార్యక్రమంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, సిటూ నాయకుడు ఎస్.జగన్నాధరావు, ఏఐటీయూసీ నాయకులు పరమేష్ రావు, కొల్లి దేముడు, కె.రామునాయుడు, బి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు మంగళవారం అంకురారోహణతో శ్రీకారం చుట్టారు. వచ్చేనెల 4వ తేదీ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో అగనంపూడి పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రగతి పార్కులో జిమ్ ఏర్పాటు



జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: 72వ వార్డు ప్రగతి పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గాజువాకలో మౌలిక సదుపాయాలతో పాటు పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేశామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలతో పాటు వారి మానసికోల్లాసానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జిమ్‌లలోని వ్యాయామ సాధనాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, వార్డు పెద్దలు గుడివాడ అమ్మన్న, బి.వి.దుర్గాప్రసాద్, శివన్నారాయణ, విశ్వనాథం, స్థానిక నాయకులు జి.ఆనంద్, గుడివాడ శ్రీనివాస్, ఎం.ఎస్.నాయుడు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు

- నాలుగేళ్ల పాలనపై వైఎస్సార్‌సీపీ సంబరాలు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ చందు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు గాజువాకలో సంబరాలు జరుపుకొన్నారు. బీసీ రోడ్‌లోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయన్నారు. ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని భావించారన్నారు.

అభివృద్ధి పథంలో ఉత్తరాంధ్ర

నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి విధానాలతో ఉత్తరాంధ్ర దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు కుళ్లు, కుతంత్రాలతో అసత్యాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, వారికి 2024లో కూడా ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, డీసీఎంఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, నాయకులు మార్టుపూడి పరదేశి, బోగాది సన్ని, ధర్మాల శ్రీను, ఈగలపాటి యువశ్రీ, పూర్ణానంద శర్మ, కోమటి శ్రీనివాస్, చిత్రాడ వెంకట రమణ, గొందేశి వెంకట రమణారెడ్డి, మెడికల్ బాబు, నక్క వెంకట రమణ, గుడివాడ లతీష్, బొడ్డ గోవింద్, ములకలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

70వ వార్డులో..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకుని ఐదో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 70వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు జరిపారు. చిట్టినాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి అందరి మన్ననలను అందుకొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబులునాయుడు, భూషణం, పల్లా రమణ, ఆచారి, పైడిరాజు, కె.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల నాటి సమస్యలు పరిష్కరించాం

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నాలుగు ప్రధాన సమస్యలకు మోక్షం
- ఎమ్మెల్యే నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: గాజువాకలో దశాబ్దాల కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు ప్రధాన సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో దశాబ్దాల కాలం నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న మేజర్ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి దఫదఫాలుగా తీసుకెళ్లానని, సానుకూలంగా స్పందించిన ఆయన వాటిని పరిష్కరించారని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో ఈ సమస్యలను పరిష్కరించగలిగామన్నారు.

- పెండింగ్‌లో ఉన్న గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించామన్నారు. 301 జీవో ప్రకారం 7200కు పైగా క్రమబద్ధీకరణ పట్టాలను గత టీడీపీ ప్రభుత్వం జారీ చేసిందని, ఎన్నికలకు ముందు ఆదరబాదరాగా ఇవ్వడంతో ఆ పట్టాలు దేనికీ పనికిరాకుండా మిగిలిపోయాయన్నారు. ఆ పట్టాలతో రిజిస్ట్రేషన్లు కావడం లేదని, ప్లాన్ అప్రూవల్ రాక గృహ నిర్మాణం కూడా చేసుకోలేకపోతున్నారని, అవసరాల కోసం ఆస్తిని అమ్ముకోవడానికి గాని, రుణాలు పొందడానికి గాని అవకాశం లేకుండా పోయిందన్న విషయాన్ని సీఎంకు చెప్పడంతో, ఆయన వెంటనే జీవో 71ను జారీ చేసి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డీడ్‌లను అందజేయాలని ఆదేశించారన్నారు. ప్రస్తుతం పట్టాల వెరిఫికేషన్ జరుగుతోందని, త్వరలోనే పూర్తి హక్కులతో కూడిన పత్రాలను అందజేస్తామని తెలిపారు.
- ఫార్మా సిటీ కాలనీలో వివాహిత మేజర్ సన్స్‌కు స్థలాల సమస్యను పరిష్కరించి పట్టాలను అందజేశామన్నారు. ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులకు స్థలాలు పట్టాలు ఇవ్వడానికి వెరిఫికేషన్ జరుగుతోందన్నారు. 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను గతంలో ఎమ్మెల్యేలు పరిష్కరించలేకపోయారని, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని పేర్కొన్నారు.
- నిర్వాసిత రైతుల వారసులకు త్వరలోనే పట్టాలను అందజేస్తామన్నారు.
- 45 ఏళ్లుగా కర్ణవానిపాలెం నిర్వాసితులు పునరావాసానికి నోచుకోలేదని, వారి సమస్యను తన హయాంలోనే పరిష్కరిస్తున్నామని చెప్పారు. గాజువాకను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

సమావేశంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు రాజాన వెంకటరావు, మంత్రి శంకరనారాయణ, పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, పూర్ణానంద శర్మ, యలమంచిలి అప్పారావు, వెంపాడ అప్పారావు, పెదిరెడ్ల ఈశ్వరరావు, ఏకుల వెంకటేష్ గౌడ్, మద్దాల అప్పారావు, బోనెల జోసెఫ్, కాకినాడ పెంటారావు, నేలపాటి సత్యవతి, మంత్రి మంజుల, జె. గోవింద, సంపంగి ఈశ్వరరావు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు

అమ్మవార్లకు కలశ పూజలు



కలశాలకు క్షీరాధివాసం నిర్వహిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి



అమ్మవార్ల ఆలయానికి కలశాలతో ఊరేగింపుగా తరలి వస్తున్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు పరిధి తుంగ్లాం గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ వార్ల నూతన ఆలయాల ప్రారంభ వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవార్ల ఆలయాల వద్ద విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం ముగ్గురమ్మలకు కలశపూజలు నిర్వహించేందుకు మహిళలు కలశాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆలయాల వద్ద అమ్మవార్లకు క్షీరాభిషేకం, చండీ యాగం, గణపతి హోమం, ఆవాహిత హోమ పూజలు వంటివి నిర్వహించారు. శిఖరంపై ప్రతిష్ఠించనున్న కలశాలకు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి క్షీరాధివాస పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

'ధూమపానం ఆరోగ్యానికి హానికరం'

అక్కిరెడ్డిపాలెం: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్.ఫణీంద్ర కుమార్ అన్నారు. ధూమపానం వల్ల అనేక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. మే 31న ప్రపంచ ధూమపాన దినాన్ని పురస్కరించుకొని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధూమపానం వల్ల ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది ప్రజలు ఏటా మరణిస్తున్నారన్నారు. సిగరెట్లు, బీడీలు కాల్చడం, హుక్కా పీల్చడం, పొగాకు నమలడం, గుట్కాలు తినడం వల్ల అనేక వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. పొగాకులో నికోటిన్ ఉండటం వల్ల ధూమపానం వ్యసనంగా మారుతుందని తెలిపారు. ధూమపానం మానేయడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ధూమపానం మానేయడానికి తప్పనిసరిగా వైద్యుని సంప్రదించాలని సూచించారు. నికోటిన్ వ్యసనం నుంచి బయటపడటానికి వైద్యుని మార్గదర్శకత్వంలో తగిన ఔషధాలు తీసుకోవాలని తెలియజేశారు.

ముగిసిన విండ్ బాల్ క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నర్సింగరావు

పెదగంట్యాడ: నడుపూరు రామాలయం మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి విండ్ బాల్ క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రైలు ప్రమాదంలో మరణించిన ప్రదీప్ కుమార్ జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీల్లో 34 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన సోల్జర్స్ టీమ్‌కు రూ.10 వేలు, రెండో స్థానంలోని సీతానగర్ టీమ్‌కు రూ.7 వేలు, మూడో స్థానంలో నిలిచిన అగనంపూడి టీమ్‌కు రూ.5 వేలు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి మృతుని మేనత్త లక్ష్మి రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాజీ సైనికుడు అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎ.ఎస్.ఆర్.రాజు, సర్పంచ్ అప్పలరాజు, జాగరపు శ్రీను, బాలు, ఆర్మీ గోవింద్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దయాల్‌నగర్ క్రీడాకారులకు పతకాల పంట



కోచ్ మూర్తి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

పెదగంట్యాడ: యునైటెడ్ షోటోకాన్ కరాటే డో ఇండియాలో గాజువాక దయాల్‌నగర్‌కు చెందిన క్రీడాకారులు అధిక పతకాలను కైవసం చేసుకున్నారని కరాటే కోచ్ నారాయణ మూర్తి తెలిపారు. అనకాపల్లిలో జరిగిన పోటీలో ట్రోఫీని సాధించారని చెప్పారు. దయాల్‌నగర్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో విజేతలకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ఒమ్మి ఈశ్వరితో కలిసి ట్రోఫీ, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ప్రధాన ప్రజారోగ్యాధికారి పర్యటన



శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ నరేష్‌కుమార్

గాజువాక: జీవీఎంసీ ప్రధాన ప్రజారోగ్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ గాజువాక జోన్‌లో మంగళవారం పర్యటించారు. జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి జోనల్ కార్యాలయంలోని పారిశుధ్య సిబ్బంది, క్లాప్ వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. 67వ వార్డులోని మస్టర్ పాయింట్లకు వెళ్లి సిబ్బంది హాజరును పరిశీలించారు. వారితో మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకర చెత్తలను గృహాల నుంచి సేకరించడంలో అలక్ష్యం వహించవద్దని సూచించారు.

బీజేపీ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న రవీంద్ర

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశంలోని అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ ఆధ్వర్యంలో రూపొందించిన బీజేపీ ప్రచార రథాన్ని గాజువాకలో ఆయన మంగళవారం ప్రారంభించారు. కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను గాజువాక జోన్‌లోని 20 వార్డుల్లో విస్తృత ప్రచారం చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీను, గూటూరు శంకరరావు, బొండా ఎల్లాజీరావు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబికాబాగ్ రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సింహాచలం

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్టాపనతో అంకురార్పణ చేశారు. ధ్వజారోహణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు వెంకటరత్నం, అనురాధ, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు టి. తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు స్వామి కల్యాణోత్సవం..

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష హోమాల అనంతరం ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరిపించనున్నారు.

సత్యదేవుని ఆలయంలో..

ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో వార్షిక దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం 7 గంటలకు స్వామి దివ్య తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు.

838వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి సత్తా ఉంటే దేశ సంపదను సృష్టించాలి, కానీ అమ్మకూడదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 838వ రోజు సంస్థకు చెందిన ఐఎన్‌ఎస్‌టీ, క్యూఏటీడీ, ఈటీఎల్, డీఎన్‌డబ్ల్యూ, సీఎండీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా ఉక్కు ఉత్పత్తుల తయారీకి కావలసిన ముడి సరుకులను సమకూర్చకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రోజుకో విభాగంలో ఉత్పత్తిని నిలిపివేస్తూ కొన్ని విభాగాలను పూర్తిగా మూసివేసి, ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు మార్చుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో హక్కుల పరిరక్షణ



మాట్లాడుతున్న రామారావు

ఉక్కునగరం: కార్మికుల ఐక్య ఉద్యమాన్ని బలపరుద్దామని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు ఎస్. రామారావు పిలుపునిచ్చారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెక్టార్-11 షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గ హక్కులను హరించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తోందన్నారు. హక్కులను కాపాడుకోవడం కోసం ఐక్య పోరాటాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, పి. శ్రీనివాసరాజు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

గోపాలపట్నం: రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని నగరపోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ సూచించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌తో పాటు సమీపంలోని ఏసీపీ కార్యాలయాలను మంగళవారం సీపీ ఆకస్మికంగా సందర్శించారు. లా అండ్ ఆర్డర్ వెస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో కేసుల నమోదు, దర్యాప్తు విధానాలను పరిశీలించారు. మహిళలపై దాడులు జరగకుండా దిశ యాప్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్ల పనితీరుపై ఆరా తీశారు. ట్రాఫిక్ స్టేషన్, వెస్ట్ సబ్ డివిజన్ క్రైం ఏసీపీ కార్యాలయంలోనూ తనిఖీలు చేశారు. కార్యక్రమంలో వెస్ట్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, క్రైం ఏసీపీ సునీల్, సీఐ బీఎండీ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

1న సహస్ర తులసిపూజ

కనక మహాలక్ష్మి దేవస్థానంలో జూన్ 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుము రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

కొత్త రూ.50 వెండి నాణెం



రూ.50 వెండి నాణెం, సేకరణ కర్త అనిల్

అల్లిపురం : దేశంలో పులుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల భారత ప్రభుత్వం, పులి ముఖంతో అతి తక్కువ ముద్రణతో 50 రూపాయల వెండి నాణెం విడుదల చేసింది. ఆ వెండి నాణాన్ని అల్లిపురం, వాసవి క్లబ్ సభ్యుడు దాసు ఆదినారాయణమూర్తి (అనిల్) సొంతం చేసుకున్నాడు. అనిల్‌కు దేశ విదేశీ నాణాలు, నోట్ల సేకరణపై ఆసక్తితో దీనిని సేకరించినట్లు తెలిపారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.75 నాణెం కూడా రానుందని ఆయన తెలిపారు. అనిల్‌ను వాసవి క్లబ్ అల్లిపురం అధ్యక్షుడు డీవీఎస్ఎస్ రాజు తదితరులు అభినందించారు.